ముగిసిన బడిబాట.. విద్యార్థులకు ఆటల పోటీలు

మలక్‌పేట ప్రభుత్వ పాఠశాలలో ఆటల పోటీలను నిర్వహిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, తదితరులు

సైదాబాద్, జూన్ 19: 'బడిబాట' ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు స్పోర్ట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరో తరగతి నుంచి పదవ తరగతి చిన్నారులకు లెమన్ అండ్ స్పూన్, కబడ్డీ, ఖో ఖో, రన్నింగ్ రేస్ పోటీలను నిర్వహించి విజేతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. విజయలక్ష్మి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 'బడిబాట' కార్యక్రమంలో మలక్‌పేట ఉన్నత పాఠశాలకు నూతనంగా 139 మంది విద్యార్థులు పాఠశాలలో చేరారని, మరో వంద మంది త్వరలోనే చేరనున్నారని అందుకోసం వారందరూ దరఖాస్తులు చేసుకున్నారని, మొత్తం పాఠశాలలో 44 మంది విద్యార్థులు ఉన్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఐఓఎస్ అప్ర, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్

పారిశుధ్య స్పెషల్ డ్రైవ్‌లో కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా, అధికారులు

ఎల్‌బీ నగర్, జూన్ 19: చైతన్యపురి డివిజన్‌లోని న్యూ మారుతినగర్, నార్త్ మారుతినగర్ , ఫణిగిరి, లక్ష్మి నర్సింహ కాలనీలలో పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. సరూర్‌నగర్ సర్కిల్‌లోని స్వీపర్లు స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొని శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రంగా నరసింహ గుప్తా, శానిటేషన్ డీఈ చందన, ఇన్‌స్పెక్టర్లు, కాలనీ అధ్యక్ష, కార్యవర్గ సభ్యులు నీరంకి రవి, ప్రభాకర్, శ్రీనివాస్ కృష్ణ, సత్తయ్య , మురళీ, రవి కేశవ్ జి, సాంబి రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు నవీన్ యాదవ్, సీనియర్ నాయకులు రుద్రారపు శంకర్, వినోద్ యాదవ్, నరేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బంజారా భవన్ నిర్మాణ పనుల పరిశీలన

హయత్ నగర్, జూన్ 19 : హయత్ నగర్ డివిజన్‌లోని బంజారా కాలనీలో రూ.50 లక్షలతో వ్యయంతో జరుగుతున్న బంజారా భవన్ నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఉన్నత అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బంజారా భవన్ నిర్మాణంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా ఎప్పటికప్పుడు అధికారుల పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఈఈ రమేష్ బాబుతో కలిసి నూతనంగా నిర్మించిన బంజారా కాలనీ ప్రధాన రోడ్ మార్గం నాణ్యతను పరిశీలించారు. డీఈ దామోదర్, ఏఈ హేము నాయక్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, కాలనీ నాయకులు బాలు, భరత్ పాల్గొన్నారు.

100 రోజుల ప్రణాళిక ఆర్భాటాల కోసమేనా?

- ఎక్కడి సమస్యలు అక్కడే...
- పేరుకుపోయిన చెత్త కుప్పలు
- డంపింగ్ యార్డ్‌లుగా ప్రధాన రహదారులు
- అధికారుల సమావేశాలు ఫొటోలకేనా?

బడంగ్ పేట్, జూన్ 19: మీర్ పేట్, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్యం పడకేసింది. ప్రధాన రహదారులపై చెత్త కుప్పలు గుట్టలుగా పేరుకపోతున్నాయి. దుర్గంధ వాసన వెదజల్లుతోంది. నిత్యం లక్షల్లో వాహనాలు నడిచే ప్రధాన రహదారి అయిన ఆర్‌సీఐ రోడ్డుపై చెత్త కుప్పలు పేరుకుపోయాయి. ఆర్‌సీఐ, శంషాబాద్ విమానాశ్రయం, శ్రీశైలం ప్రధాన రహదారికి పోయే రోడ్డుపైననే చెత్త గుట్టలుగా పేరుకుపోయి దుర్గంధ వాసన వెదజల్లుతోంది. నిత్యం అదే రోడ్డుపై ఎంతోమంది వీఐపీలు ప్రయాణిస్తుంటారు. అది ప్రధాన రహదారి అని తెలిసినప్పటికీ మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషణ్ అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో సమస్య జటిలంగా మారింది. చాలామంది అధికారులు ఫిర్యాదులు చేస్తున్నప్పటికీ మున్సిపల్ అధికారుల్లో చలనం లేదని ఆరోపణలు వస్తున్నాయి

ఆర్భాటాల కోసమే 100 రోజుల ప్రణాళిక

మున్సిపాలిటీల పరిధిలో వందరోజుల ప్రణాళిక పకడ్బందీగా చేస్తున్నట్లు ఫొటోలు దిగడం సోషల్ మీడియాలో పోస్టులు చేయడం వరకు బాగానే ఉంది. సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే ఉంది. అధికారులు నాలుగు గోడల మధ్య సిబ్బందికి శిక్షణ ఇస్తున్నట్లు ప్రకటనల వర్షం కురిపిస్తూనే ఉన్నారు. ఫొటో సెషన్ అయిపోయిన తర్వాత ఎవరి దారిలో వాళ్లు వెళ్లిపోతున్నారు. తడి, పొడి చెత్త వేరు చేయాలని, చెత్త ఆటోలనే చెత్త వేయాలని, రోడ్లపై ఎవరు చెత్త

ఆర్‌సీఐ ప్రధాన రహదారిపై పేరుకుపోయిన చెత్త కుప్పలు

దుర్గంధ వాసన వస్తోంది

ఆర్ సీఐ ప్రధాన రహదారిపై చెత్త పేరుకుపోయింది. ఎవరు పట్టించుకోవడం లేదు. దుర్గంధ వాసన వస్తోంది. సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. అధికారులు ఎందుకు పట్టించుకుంటలేరో అర్థం కావడం లేదు.

– ఎర్ర జై హింద్, స్థానికుడు

వేయకూడదని పదే పదే చెబుతున్నారు తప్ప ఆచరణలో మాత్రం అది సాధ్యం కావడం లేదని చాలా మంది సిటిజన్స్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 100 రోజుల ప్రణాళిక అంటే పేపర్లకి పరిమితం అవుతారా? సమస్యలను ఏమన్న పరిష్కరిస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

పారిశుధ్యంపై కోట్ల ఖర్చు ..

పారిశుధ్య నిర్వహణపై అధికారులు కోట్లు ఖర్చు చేస్తున్నట్లు రికార్డులు చెబుతున్నాయి. పిచ్చి మొక్కలు, గల్ఫర్ పనులు, జంగల్ కటింగ్, తదితర వాటి బిల్లుల లెక్కలకు అంతు అదుపు లేకుండా పోయింది. కోట్లు ఖర్చుపెట్టినప్పటికీ పారిశుధ్యం ఫర్వాలేదు అనిపించేలా

సిబ్బందికి చెప్పి చెత్తను తొలగిస్తా

ఆర్‌సీఐ రోడ్డు పైన చెత్తను తొలగిస్తాం. పరిశీలించి సిబ్బందికి చెబుతాను. రాత్రి సమయంలో ఎవరో చెత్త వేస్తున్నట్లు ఉంది. ఎప్పటికప్పుడు క్లీన్ చేయమని సిబ్బందికి చెప్పాను. రేపు సిబ్బందికి చెప్పి చెత్త మొత్తం తొలగిస్తాను.

– జ్ఞానేశ్వర్, కమిషనర్

పనులు చేయడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ప్రధాన రహదారుల పై సమస్యలు ఇలా ఉంటే కాలనీలో సమస్యలు ఇంకా అధ్వానంగా ఉన్నాయని పలు కాలనీ సంక్షేమ సంఘాలు మున్సిపల్ అధికారులకు అనేక ఫిర్యాదులు చేసిన సందర్భాలు కోకోల్లలుగా ఉన్నాయి.

ఆర్‌సీఐ రోడ్డుపై ఉన్న చెత్త ఎవరు ఎత్తాలి?

ఆర్‌సీఐ ప్రధాన రహదారి రాఘవేంద్ర హోటల్ సమీపంలో చెత్త కుప్పలుగా పేరుకుపోయింది. మీర్ పేట్, బడంగ్ పేట్ మున్సిపాలిటీల సరిహద్దులను వదిలేస్తున్నారా? మాకెందుకులే అని వదిలేశారా? గత కొన్ని నెలల నుంచి తొలగించకపోవడానికి గల కారణాలేంద్ని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పై అధికారులు ఎవరు దృష్టి సారించకపోవడంతో మున్సిపల్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నట్లు తెలుస్తోంది.

సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం

అసలే వర్షాకాలం, సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిసినప్పటికీ అధికారులు ఎవరు కూడా పట్టించుకోకపోవడం పట్ల ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. దోమలు వృద్ధి చెందడానికి చెత్త డంపింగ్‌లు ప్రధాన కారణమని తెలిసినప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు ఎందుకు వదిలేస్తున్నారో తెలవదని స్థానికులు మండిపడుతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ప్రధాన రహదారులపై ఉన్న చెత్త తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

బోనాల ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

నల్ల పోచమ్మ దేవాలయ తృతీయ వార్షికోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

మన్సూరాబాద్, జూన్ 19: మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధి బాలాజీనగర్ కాలనీలోని నల్ల పోచమ్మ దేవాలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి వేడుకలకు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కాలనీలలో త్వరలో నిర్వహించుకునే బోనాల ఉత్సవాల నిర్వాహణ కోసం జీహెచ్ ఎంసీ నుంచి నిధులను మంజూరు చేయిస్తున్నట్లు తెలిపారు. బోనాల ఉత్సవాలను భక్తి, శ్రద్ధలతో జరుపుకోవాలని సూచించారు. కాలనీలలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా బోనాల ఉత్సవాలను నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు టి. నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాగార్జున రెడ్డి, యానాల కృష్ణారెడ్డి, కాలనీవాసులు మోహన్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి, యాదగిరి రెడ్డి, వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, మధుసూదన్ రెడ్డి, ప్రసాద్, జంగారెడ్డి, కృష్ణారెడ్డి, సంధ్య, కళ్యాణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

వైద్య శిబిరంలో భక్తులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సైదాబాద్, జూన్ 19 : ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని లక్ష్మినగర్ కాలనీలోని షిర్డిసాయిబాబా మందిరంలో హెర్బ్-ఫ్రెష్, నవేద హెర్బల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత ఆయుర్వేద, నేచరోపతి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా కాలనీవాసులకు అనేక రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఆరోగ్యం, శారీరక, మానసిక, రుగ్మతలపై, ఆలవాట్లపై వైద్యులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నవేద హెర్బల్ సంస్థ ఫౌండర్ గుండు నవీన్, డాక్టర్ గుండ కల్యాణి, కె. హరిప్రియ, సాయి కుమార్, అరుణకుమార్,టి. రాహుల్, వైద్య సిబ్బంది లూసీ, టి, కీర్తి, వరప్రసాద్, సాయి బాబా ఆలయ కమిటీ ప్రతినిధి నెర్రేళ్ల ప్రసాద రావు, రాజ్యలక్ష్మీ, శేషగిరి రావు, రమేశ్, భక్తులు, కాలనీవాసులు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: ఎమ్మెల్యే

సైదాబాద్, జూన్ 19: మలక్‌పేట నియోజకవర్గం అక్బర్ బాగ్ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఎమ్మెల్యే అహ్మద్ బలాల వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా అక్బర్ బాగ్ డివిజన్ పరిధిలోని దయానంద నగర్, ఆనంద నగర్, బస్తీ దవాఖాన, పార్క్ తదితర ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటి పరిష్కార మార్గాలను అధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలంలో తలెత్తే వరద నీటి ఇబ్బందులను శాశ్వతంగా పరిష్కరించడానికి అవసరమైన చర్యలన్నీ తీసుకోవాలని జలమండలి, జీ హెచ్ ఎంసీ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో అభివృద్ధి పనులను ప్రణాళిక బద్ధంగా కొనసాగించాలని, తద్వారా భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా స్థానికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. మురుగునీటి, తాగునీటి వ్యవస్థలను, ఫుట్ పాత్, పార్క్

ఆనంద్ నగర్‌లో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బలాల

ను ఆధునీకరించాలని, విద్యుత్ సమస్యలు ఉత్పన్నం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆయన ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అక్బర్ బాగ్ డివిజన్ కార్పొరేటర్ మీనాజ్, స్థానిక నాయకులు నాగరాజ్ గౌడ్, మోహన్ రాజ్, జీహెచ్ఎంసీ, జల మండలి, విద్యుత్, శానిటేషన్, తదితర విభాగాలు చెందిన అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 19: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆస్మాన్ ఘడ్ సబ్ డివిజన్ పరిధిలో పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు అస్మాన్ ఘడ్ డీఈ విష్ణువర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.11కేవీ సింగరేణి కాలనీ ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, 11కేవీ సరస్వతి నగర్ కాలనీ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు ఆయా ఫీడర్ల ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలి: డీసీ

అధికారులు, డివిజన్ నాయకులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న డీసీ జయంత్

మలక్ పేట జూన్ 19: పాత మలక్‌పేట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అన్ని అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని సర్కిల్- 6 డిప్యూటీ కమిషనర్ జయంత్ అధికారులను ఆదేశించారు. డివిజన్ ఈ ఈ, ఏఈ మోబిన్ పాషా, వర్క్ ఇన్ స్పెక్టర్ సత్యనారాయణ, డివిజన్ ఎంఐఎం అధ్యక్షుడు షఫీలతో కలిసి తన కార్యాలయంలో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలను ఈఈ, ఏఈలను అడిగి తెలుసుకున్నారు. వర్షాలు ఎక్కువవకముందే పనులన్నింటినీ పూర్తి చేయాలని, ముంపు సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వర్షాలు కురిస్తే పైపులైన్ల నిర్మాణ పనులు, రోడ్ల నిర్మాణ పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందని, పనులు సజావుగా సాగలేని పరిస్థితి నెలకొంటుందని ఆయన తెలిపారు. అభివృద్ధి పనుల నిర్వహణ విషయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే తన దృష్టికి తేవాలని ఆయన సూచించారు.

గుడిసెవాసులకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలి

సైదాబాద్ మండల తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న కోట్ల శ్రీనివాస్, తదితరులు

సైదాబాద్, జూన్ 19 : సైదాబాద్ మండల పరిధిలోని ఐఎస్ సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణికాలనీ సర్వేనెంబర్ 65 నుంచి 77 వరకు, 133 పార్ట్‌లోని 25 ఎకరాల స్థలంలో గుడిసెలు వేసుకొని పేద ప్రజలు జీవిస్తున్నారని, వారందరికీ తక్షణమే పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్, స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వివిధ జిల్లాలకు చెందిన పేద ప్రజలు స్థానికంగా గుడిసెలు వేసుకొని, అనేక ఏళ్లుగా జీవిస్తున్నారని, వారికి ఆధార్, ఓటర్, రేషన్ కార్డులను ఇచ్చారని, అదే విధంగా స్థానికంగా గుడిసెల్లో సీసీ రోడ్లు, కరెంట్ వంటి సౌకర్యాలు కల్పించారని తెలిపారు. గుడిసెవాసులందరికీ పొజిషన్ పట్టా సర్టిఫికెట్లు ఇవ్వాలని అఖిల పక్ష పార్టీలు ప్రభుత్వాలను, అధికారులను కోరారని ఆయన గుర్తు చేశారు. ఈ మధ్య కాలంలో కొందరు సొసైటీ పేరుతో ఆక్రమించాలని చూస్తున్నారని, అందుకోసం రెవెన్యూ అధికారుల పొజిషన్ సర్టిఫికెట్లు ఇవ్వాలని, ఈ విషయాన్ని రెవెన్యూ ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, సీఎం రేవంత్, నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్తామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి, అలివేలు, లడ్డు పటేల్, మాదారం లక్ష్మన్‌రావు, శంకర్ నాయక్, దాస్, తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలి

కందుకూరు, జూన్ 19: పేద విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేయాలని పారిశ్రామికవేత్త అంబటి చెన్నయ్య ముదిరాజ్ తెలిపారు. మండల పరిధిలోని చిప్పలపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో గురువారం పేద విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, బ్యాగులు. పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు విద్యలో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉందని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నత స్థాయిలో రాణించాలని, అందుకోసం ప్రభుత్వ పాఠశాలల పట్ల చిన్నచూపు చూడవద్దని కోరారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని

విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు అందజేసిన దాతలు, ఉపాధ్యాయులు

పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలు దీటుగా తయారైనట్లు చెప్పారు.

కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ లలిత కుమార్, మాజీ సర్పంచ్ బాల కృష్ణ, ప్రధానోపాధ్యాయులు రాం దాసు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రజిత, రాజు, జంగయ్య, శీను, ఉపాధ్యాయులు రాజు, పుష్పలత, సుధా, రేణుక, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

మాదన్నపేట, జూన్ 19: గుట్టు చప్పుడు కాకుండా ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తున్న వారిని అదుపులో తీసుకున్న సంఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పిసల్‌బండ వద్ద కొన్ని రోజులుగా ముగ్గురు మహిళలు ఓ ఇంట్లో వ్యభిచారం నిర్వహిస్తునట్లు సమాచారం అందుకున్నారు.

బుధవారం రాత్రి సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి ముగురు మహిళలను, ఒక విటుడిని పట్టుకొని బైక్ స్వాధీన పరుచుకొని సంతోష్‌నగర్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతునట్లు పోలీసులు తెలిపారు.

దివ్యాంగుల పెన్షన్ పెంపునకు

పోరాటం ఉధృతం చేస్తాం : మంద కృష్ణమాదిగ

సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

మన్సూరాబాద్, జూన్ 19: ప్రజల్లో నిరంతరం ఉంటూ కులం, మతంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడేందుకు పోరాటం కొనసాగించడం జరిగిందని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. పద్మశ్రీ పురస్కారం పొందిన మంద కృష్ణ మాదిగ అభినందన సభను గురువారం నాగోల్‌లోని శుభం కన్వెన్షన్ హాల్లో దివ్యాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో నిర్వహించారు. మంద కృష్ణమాదిగ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ, ప్రజల హక్కుల సాధన కోసం చేసిన పోరాటాలకు గుర్తింపుగానే పద్మశ్రీ అవార్డు దక్కిందని తెలిపారు. దివ్యాంగులకు న్యాయంగా రావల్సిన హక్కులతో పాటు రాజ్యాధికారంలో భాగస్వామ్యం సాధించే వరకు పోరాటం సాగిస్తామన్నారు. రాష్ట్రంలో దివ్యాంగుల పెన్షన్ల పెంపు కోసం పెద్ద ఎత్తున పోరాటం చేశామన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు రూ. 6 వేల పెన్షన్ ఇస్తామని మాట ఇచ్చి తప్పారని తెలిపారు. దివ్యాంగులకు రూ. 6 పెన్షన్ల పెంపు సాధన కోసం పోరాటం ఉధృతం చేస్తామన్నారు. వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జంగయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ జాతీయ కోర్ కమిటీ చైర్మన్ గోపాలరావు, వైస్ చైర్మన్ అందె రాంబాబు, జాతీయ అధ్యక్షుడు సుజాత సూర్యవంశీ, జాతీయ మహిళా అధ్యక్షురాలు సామినేని భవానీ చౌదరి, నాయకులు అన్యం చిన్న సుబ్బయ్య యాదవ్, గోవిందు నరేష్ మాదిగ, రాగళ్ల ఉపేందర్ మాదిగ, రావుగళ్ల బాబు, పెంటనోళ్ల నర్సింహా, కొమ్ము రాజశేఖర్, పాపిరెడ్డి, గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

తండ్రిని చంపిన కుమారుడికి రిమాండ్

కందుకూరు ,జూన్ 19 : మండల పరిధిలో పులిమామిడి గ్రామములో తండ్రిని హత్య చేసిన కొడుకును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. కందుకూరు పోలీస్ స్టేషన్ సీఐ సీతరాం తెలిపిన వివరాల ప్రకారం.. పులిమామిడి గ్రామానికి చెందిన పసుపుల చిన్న జంగయ్యకు(65) కుమారుడు శేఖర్ తండ్రి పేరు మీద ఉన్న అర ఎకరం భూమి అమ్మనివ్వడం లేదని తండ్రి పై కక్ష పెంచుకొని మంగళవారం అర్ధ రాత్రి శేఖర్ వాళ్ల ఇంటికి వెళ్లి స్లాబ్ క్రింద నిద్రపోతున్న జంగయ్య తల మీద దగ్గరలో ఉన్న గ్రానైట్ రాయి తీసుకుని గట్టిగా వేయగా, తలకు తీవ్ర గాయాలు అయ్యాయి. అయిన కూడా కదులుతుండగా, చనిపోలేదని పక్కనే ఉన్న ఒక కర్రను తీసుకుని ముఖంపై కొట్టాడు. దాంతో జంగయ్య అక్కడిక్కడే మరణించాడు. ఈ విషయమై మృతుడి భార్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం టీములు తయారు చేసి గాలింపు చర్యలు తీసుకున్నారు. అయితే ఈరోజు ఉదయం ఈ కేసులోని నిందితుడు అయిన పసుపుల శేఖర్‌ను అదుపులోనికి తీసుకుని విచారించిన అనంతరం వైద్య పరీక్షలు చేసి మహేశ్వరం కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

సమస్యల వలయంలో శ్రీసాయినగర్ కాలనీ

- బార్లా తెరుచుకున్న వరద, మురుగునీటి నాలా
- పది రోజులుగా తాగునీరు కలుషితం
- ఫిర్యాదు చేసినా పట్టించుకొని అధికారులు

మన్సూరాబాద్, జూన్ 19: కాలనీల ప్రజలు సమస్యలతో సతమతవుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రమాదాలు జరుగుతున్నాయి.. ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి మహాప్రభో ఒక్కసారి ఇటువైపు కన్నెత్తి చూడండంటూ ప్రజలు మొర పెట్టుకుంటున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. సమస్యలు తీవ్ర రూపం దాల్చకముందే కాలనీ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలంటూ సంబంధిత అధికారులను మన్సూరాబాద్ శ్రీసాయినగర్ కాలనీకి చెందిన ప్రజలు వేడుకుంటున్నారు. నాగోల్ డివిజన్ పరిధిలోకి వచ్చే శ్రీసాయినగర్ కాలనీలో సమస్యల పరిష్కారానికి ఎప్పుడు అధికారులు చర్యలు తీసుకుంటారోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

శ్రీసాయినగర్ కాలనీ రోడ్డు నెం. 2 గుండా ప్రవహిస్తున్న వరదనీటి నాలాపై ఉన్న మ్యాన్ హోల్ కుంగిపోయి ఇరవై రోజులు గడుస్తోంది. ఈ నాలా 12 ఫీట్ల లోతుతో ప్రవహిస్తోంది. నాలా వరదనీటి కోసమే ఏర్పాటు చేసినప్పటికీ ప్రస్తుతం ఇందులో మురుగునీరు కలుస్తోంది. బీఎన్‌రెడ్డి డివిజన్‌కు చెందిన సాహెబ్‌నగర్, వనస్థలిపురం డివిజన్, హయత్‌నగర్ డివిజన్, మన్సూరాబాద్ డివిజన్ పరిధికి చెందిన సుమారు 80 కాలనీల మురుగు, వరదనీరు ఈ నాలా గుండా ప్రవహించి బండ్లగూడ చెరువులోకి చేరుకుంటుంది. వరద ఉధృతి తీవ్రంగా ఉండే ఈ నాలా ఇప్పుడు బార్లా తెరుచుకుని ఉండటంతో అందులో వాహనదారులు, పాదచారులు పడే అవకాశాలు ఉన్నాయి. ఈ మధ్య వర్షం కురిసిన సమయంలో నాలాపై నుంచి రోడ్డును కమ్మేస్తూ వరద కొనసాగింది. నాలా తెరుచుకుని ఉన్న విషయం తెలియని వాహనదారులు అటువైపుగా వచ్చి ప్రమాదాల

మ్యాన్‌హోల్ కుంగి.. ప్రమాదాలు

ఇరవై రోజుల క్రితం వరద నీటి కాలువపై ఉన్న మ్యాన్ హోల్ కుంగిపోయింది. దీంతో నాలా బార్లా తెరుచుకుని ఉంది. ఉధృతంగా ప్రవహించే వరద, మురుగునీటి కాలువ సుమారు 12 ఫీట్ల లోతుతో ప్రవహిస్తోంది. ప్రమాదవశాత్తు ఇందులో ఎవరైనా పడితే గల్లంతై బండ్లగూడ చెరువులో తేలుతారు. ఇంతటి ప్రమాదకరంగా మ